క్లుప్తంగా

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఉపాధ్యాయబృందం

మోమిన్‌పేట: టీటీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీఓ శైలజారెడ్డి సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, వారు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చి దిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, కార్యదర్శి మోహన్‌రెడ్డి, శాఖ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు మహంత్‌స్వామి, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

దౌల్తాబాద్: సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ రమేష్‌కుమార్ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో చాలా మంది రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇదే అదనుగా సైబర్ మోసగాళ్లు అక్రమాలకు పాల్పడే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. మీకు ఇల్లు వచ్చింది, మహాలక్ష్మి పథకం డబ్బులు అకౌంట్లో పడాలంటే మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పమని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడుగుతారని, ప్రజలు ఎవరు కూడా ఓటీపీ చెప్పవద్దని తెలిపారు. ఎవరైనా ఓటీపీ చెప్పినట్లయితే మీ ఖాతాలోని డబ్బులు ఓటీపీ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకుంటారని వెల్లడించారు. కావున అపరిచితుల ఫోన్లకు స్పందించ వద్దని సూచించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఆవు కళేబరం

యాలాల: ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తున్న ఓ ఆవు సోమవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి దేవనూరు గ్రామానికి చెందిన కిందికేరి మాజీద్, ఎప్పటిలాగే తన ఆవును మేత కోసం గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ నియంత్రిక వద్ద ఆవు మేత మేస్తుండగా.. షాక్ కొట్టి ఆ మూగ జీవి అక్కడికక్కడే చనిపోయింది. రూ.65 వేల విలువ గల ఆవు మృతి చెందడంతో రైతు కన్నీటి పర్యంతం అయ్యాడు. జీవనాధారం కోల్పోయాని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ప్రజాపాలన విజయవంతంపై హర్షం

దౌల్తాబాద్: ఆరు గ్యారంటీల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం మండలంలో విజయవంతంగా ముగిసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల, జిల్లా కార్యవర్గసభ్యుడు వీరన్నలు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, అది పూర్తయిన వెంటనే అర్హులను ప్రభుత్వం గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా అర్జీ పెట్టుకోని వారు ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ



బాధితుడికి మొబైల్ అందజేస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

దోమ: దొంగిలించబడిన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్) యాప్ ద్వారా రికవరీ చేసుకొని బాధితుడికి అందజేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి బాస్పల్లి గ్రామ వాసి రామకృష్ణకు చెందిన సెల్‌ఫోన్.. గతేడాది అక్టోబర్ 25న దుర్గామాత నిమజ్జన వేడుకల్లో చోరీకి గురైంది. దీంతో బాధితుడు వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీఈఐఆర్ ద్వారా ఫోన్ వివరాలను నమోదు చేసి, బ్లాక్ చేశారు. తాజాగా శనివారం ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తిని గుర్తించి, సెల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితుడు రామకృష్ణను పిలిపించి మొబైల్‌ను అందజేశారు. అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

ఇది ప్రజా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

నిర్లక్ష్యం చేస్తే సహించం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలి
- విద్యుత్ సమస్యను అధిగమించాలి
- తాగునీటి ఎద్దడిని నివారించాలి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: 'మాది ప్రజా ప్రభుత్వం. వారి వద్దకే మా పాలన. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు' అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సోమవారం బషీరాబాద్ ఎంపీపీ కరుణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సారి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, నాణ్యమైన విద్యావిధానం తీసుకురాబోతున్నట్లు బీఎమ్మార్ వెల్లడించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని చెప్పారు.

విద్యుత్ సమస్యలపై చర్చ

సమావేశంలో తొలుత ఎజెండాలోని పలు అంశాలను చర్చించారు. గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పలువురు సభ్యులు ఏఈ మోహన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇళ్లమీద నుంచి 11 కేవీ విద్యుత్ తీగల లైను ఉందని, రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నా, వాటిని ఎందుకు తొలగించడం లేదని ఏఈని ప్రశ్నించారు. ప్రతీ సమీక్షలో చెబుతున్నా సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కలుగజేసుకొని రెండు రోజుల్లో మండల పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, తనకు నివేదించాలని ఏఈని ఆదేశించారు. నిధులు అవసరమైతే చెప్పాలని సూచించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కలెక్టర్‌కు రిపోర్టు ఇవ్వాలి

సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకొని, కలెక్టర్‌కు రిపోర్టు ఇవ్వాలని ఎమ్మెల్యే బుయ్యని ఎంపీడీఓకు సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రాకుండా వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన మండలానికి అధిక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంతబాయి, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ వెంకట్‌స్వామి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

రైల్వే లైన్‌కు ప్రత్యేక కార్యాచరణ

- పరిగి అభివృద్ధికి సహకరించాలి
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: 'పరిగి మీదుగా రైల్వేలైన్ ప్రతిపాదనపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. నెల రోజుల్లో రీ సర్వే పనులను ప్రారంభిస్తారు. అందుకు సంబంధించి టెండర్‌ను ప్రభుత్వం పూర్తి చేసింది' అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజలపాలన అని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ఇదిలా ఉండగా.. సమావేశంలో 21 అంశాలపై చర్చించారు. తొలుత పలువురు సర్పంచులు మాట్లాడుతూ తమ పదవీ కాలం ముగియనుందని, ఇంకా చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సభలో ప్రస్తావించగా.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి వివరాలను తీసుకొని, త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ శేషగిరిశర్మ, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' అందక ఆందోళన

- పోస్టల్ సిబ్బందిపై మండిపాటు
- డబ్బులు ఇవ్వటం లేదంటూ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన
- తమగోడు వినేవారు లేరంటూ పండుటాకుల పరేషాన్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసున్న లబ్ధిదారులు

కుల్కచర్ల: వృద్ధాప్యంలో ఇబ్బందులకు గురౌతున్నా.. తమ గోడు వినే నాథుడే లేరని పింఛన్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేశారు. ఆసరా పంపిణీలో జాప్యం జరుగుతుందంటూ సోమవారం వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు చౌడాపూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మందిపల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు మాట్లాడారు. పింఛన్ డబ్బుల పంపిణీలో రోజుకో కారణం చూపుతూ తపాలా సిబ్బంది తమను తిప్పుతున్నారని ఆరోపించారు. ఒక రోజు కరెంట్ లేదని, మరుసటి దినం మరో కారణాన్ని సాకుగా చూపుతూ పైసలు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్ పింఛన్ దారుల విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. పెన్షన్ డబ్బులు మహబూబ్‌నగర్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి వస్తున్న క్రమంలో వారు ఇక్కడి ప్రాంత లబ్ధిదారులను పట్టించుకోవటం లేదని ఆయన పేర్కొన్నారు. సమస్యను ఇరు జిల్లాల కలెక్టర్లకు తెలుపుతామని జెడ్పీటీసీ తెలిపారు. వచ్చే కొద్దిపాటి డబ్బుల కోసం వారిని ఇలా తిప్పడం సరికాదని హితవు పలికారు.

ఆలోచన ఘనం.. ఆచరణే శూన్యం

- అక్కరకురాని రైతు వేదికలు
- మండలంలో రూ.1.76 కోట్లతో నిర్మాణాలు
- నిర్వహణ లోపంతో కళతప్పిన చైతన్య దీపికలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఊరికి దూరంగా నిర్మించిన రైతువేదిక

దౌల్తాబాద్: రైతులకు చైతన్య దీపికలుగా భావించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. అన్నదాతలకు సాగులో అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉపయోగకరంగా ఉంటాయనుకున్న వేదికలు నిర్వహణ లోపంతో బోసిపోతున్నాయి. ఆలోచన గొప్పదే అయినా.. ఆచరణకు నోచుకోకపోవడంతో కర్షకులతో కళకళలాడాల్సిన అవి.. ఒంటరిగా మిగిలిపోయాయి. పలు క్లస్టర్లలో రూ.లక్షలు వెచ్చించి ఇలా వదిలేయడం మంచిది కాదని, పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఒక్కో రైతువేదికకు రూ.22లక్షలు

మండలంలోని దౌల్తాబాద్, నందారం, కుదురుమళ్ల, చల్లాపూర్, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, బాలంపేట, బిచ్చాల క్లస్టర్ గ్రామాల్లో రూ.12లక్షలు ఉపాధిహామీ పథకం ద్వారా, రూ.10లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఒక్కో వేదిక నిర్మాణం కోసం రూ.22లక్షలు ఖర్చు చేశారు. బిచ్చాల, దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో ఊరికి చివరగా భవనాన్ని నిర్మించడంతో వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

ఊరికి దూరంగా ఉన్న రైతువేదికలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. చీకటి పడిన తరువాత మద్యం ప్రియులు, జూదరుల ఇష్టారాజ్యం పెరిగింది. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఇలాంటి వాటికి అది అనుకూలంగా మారిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రైతువేదికలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రైతుల అవసరాలకే

రైతు వేదికలను రైతుల అవసరాలకు వినియోగిస్తున్నాం. క్లస్టర్ స్థాయి ఏఈఓలు రైతులతో సమీక్షించి, అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆ వేదికల వద్ద ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిశీలించి తగిన చర్యలు చేపడతాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

22 నుంచి అయోధ్య ఉత్సవాలు

తాండూరు టౌన్: అయోధ్యలో భవ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు అయోధ్య ఉత్సవాలను నిర్వహించనున్నారు. 22న గోశాలలో ఉదయం 9గంటలకు గోపూజ, వినాయక పూజ, 10 గంటలకు రాముల వారి అభిషేకం, 11 గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవం జరపనున్నారు. సీతాదేవి తరఫున గుముడాల సుధాకర్ దంపతులు, శ్రీరాముని తరఫున డాక్టర్ సతీష్‌బాబు దంపతులు కల్యాణం జరిపించనున్నారు. ఉత్సవానికి పురుషులు తెల్లటి దుస్తులు, స్త్రీలు సంప్రదాయ చీరకట్టులో రావాలని సూచించారు. 23న సాయంత్రం 5గంటల నుంచి స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభం కానున్న ఊరేగింపును పుర వీధుల గుండా సాగి, గోశాలలో ముగియనుందని సమితి సభ్యులు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన దలచే పురుషులు తెల్లటి దుస్తులు, మహిళలు కాషాయం రంగు చీరకట్టులో రావాలని తెలిపారు. 24న గోశాలలో సాయంత్రం 4గంటల నుంచి గీతా పారాయణం, సుందరకాండ పారాయణం, భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమితి సభ్యులు కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధి 15 మంది బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కాబట్టి, ప్రాంత ప్రజలకు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు.

నూతన పింఛన్ విధానం రద్దు చేయాలి

అనంతగిరి: నూతన పింఛన్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ వికారాబాద్ బ్రాంచ్ కార్యదర్శి బహదూర్ డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానంతో తమకు నష్టం కలుగుతుందన్నారు. కార్మికుల వ్యతిరేక విధానాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రెజరర్ అమర్‌నాథ్, సీనియర్ నాయకుడు మాధవకృష్ణ, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ బాలాజీ, రమేష్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



అనంతగిరి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సభాపతి ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామం బీరప్ప దేవాలయంలో నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, నాయకులు శివయ్య, బందెల్లి ఉన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో సన్మానం

తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. స్పీకర్ నివాసంలో ట్రస్మా ప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాయకులు నాగయ్య, వెంకట్‌రెడ్డి, యాస్కి సునీల్ గుప్తా, లూయిస్, నర్సింహులు, శేఖర్, బస్వరాజు, తిరుమలయ్య, ప్రవీణ్‌కుమార్, అజారుద్దీన్, బాబురావు, కిషోర్, విక్రంరెడ్డి, సుదీర్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. వికారాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యుడు జంప్ల, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, దేవ్యానాయక్, బస్వరాజు, కరుణాకర్, దేవయ్య, శివప్ప, సమీయొద్దీన్, బందయ్య, శ్రీనివాస్, దీపక్, సుధాకర్ ఉన్నారు.

◆ బీమా పథకాలను వినియోగించుకోండి

బంట్వారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బార్వాద్ బ్రాంచ్ మేనేజర్ నరేందర్ అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండలం బార్వాద్, బార్వాద్ తండాల్లో ప్రమాద బీమా పథకాలపై ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ గడపగడపకూ అక్షితలు

దోమ: అయోధ్య నుంచి వచ్చిన రామయ్య అక్షితలకు స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఐనాపూర్ సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ విజయ, నర్సింహ యాదవ్, చంద్రశేఖర్, రాములు, రమేశ్, గుడిసెబాబు, అప్పగాళ్ల రమేశ్, ప్రభాకర్, భీమయ్య, శ్రీనివాస్, రాఘవేందర్, యాదయ్య, శ్రీనివాస్ యాదవ్, చిన్న, యాదయ్య, రమేశ్, సురేశ్, కుమార్, మల్లేశ్, ఆంజనేయులు, రాజు, మేకల జనార్దన్, బాబయ్య, కృష్ణయ్య, సిద్దయ్య, భీమయ్య, మహేశ్,ఆనంద్ ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అయోధ్య అక్షితలను హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు మండల పరిధి గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా అక్షితలను ఆశీర్వాదంగా తీసుకోవాలని సూచించారు.

◆ ఎంపీపీ జన్మదిన వేడుకలు

బషీరాబాద్: ఎంపీపీ కరుణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని, ఎంపీపీ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఆర్‌బీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియలో అప్రమత్తత అవసరం

- తప్పులు లేకుండా కంప్యూటరీకరణ చేయాలి
- సందేహాలుంటే దరఖాస్తు దారులకు ఫోన్ చేయండి
- డాటా ఆపరేటర్లకు సూచించిన అధికారులు



మోమిన్‌పేట: అర్జీల కంప్యూటరీకరణను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి



దౌల్తాబాద్: ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

మోమిన్‌పేట: అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీల కంప్యూటరీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాటా ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఫారంలో అర్జీదారుడి సమాచారం సరిగా లేనట్లైతే, వారికి ఫోన్ చేసి తగిన స్పష్టత తీసుకోవాలని, వారి ఇచ్చిన సమాచారం, పేర్కొన్న అంశాన్ని ఆన్‌లైన్లో పొందుపరచాలన్నారు. తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. మండల పరిధిలో మొత్తం 13,412 దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు.

తప్పులు లేకుండా వివరాల నమోదు

దౌల్తాబాద్: ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను సరిచూసుకొని, తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ తిరుమలస్వామి ఆపరేటర్లకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటరీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో మొత్తం 14,270 దరఖాస్తులు వచ్చాయని, వాటిని గ్రామాల వారీగా ఆయా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి, ఆపరేటర్లతో వివరాలను నమోదు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. నమోదు విధానాన్ని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రక్రియను ఆయా అధికారుల పర్యవేక్షిస్తున్నారు.

పొరపాట్లకు తావులేకుండా..

వికారాబాద్ అర్బన్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసే సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎంతో మంది ఆరు గ్యారంటీల కోసం ఎదురు చూస్తున్నారని, పేదలను దృష్టిలో పెట్టుకొని వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని సూచించారు. ఇందులో కమిషనర్ జాకీర్ అహ్మద్, ఏఈ రాయుడు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నమోదును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కుల్కచర్ల: అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని కుల్కచర్ల మండల ప్రత్యేకాధికారి సరళాదేవి అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఆరు గ్యారంటీ అర్జీల కంప్యూటరీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండల పరిధి గ్రామపంచాయతీలకు చెందిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందు పరిచే విషయంలో జీపీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపీఓ వెంకటేశ్, కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటేలో సత్తా చాటిన తాండూరు విద్యార్థులు

తాండూరు టౌన్: కరాటేలో తాండూరు విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం షాద్‌నగర్‌లో జరిగిన 16వ నేషనల్ లెవల్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో హర్షిత, మణికంఠ, హనిక గ్రాండ్ ఛాంపియన్ కప్పులు సొంతం చేసుకున్నారు. మరో ఏడుగురు బంగారు పతకాలు, ఆరుగురు వెండి, ఒకరు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లు బీవీ సాయికుమార్, మోహన్‌కృష్ణ మాట్లాడారు. 27 సంవత్సరాలుగా తాండూరులో చిన్నారులు, యువతకు ఉచితంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ విద్య ద్వారా వారు మానసిక, శారీరక దృఢత్వాన్ని పొందుతారని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తాండూరు పేరు నిలబెట్టేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఉచిత శిక్షణ కోసం 9848743067 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.